క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

సాలూరు రూరల్: సాలూరు మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను గురువారం సాలూరులోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ తెలిపారు. డిప్యూటీ సీఎం, మంత్రి పీడిక రాజన్నదొర చేతుల మీదుగా పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో సక్రమంగా అందజేస్తున్నామని ఆయన చెప్పారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మక్కువ: దేశ స్వాతంత్య్రం కోసం, స్వాతంత్య్ర సమరయోధులు చేసిన పోరాటాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రిన్సిపాల్ మంజులావీణ అన్నారు. ఈ మేరకు మండలంలోని ములక్కాయవలస గ్రామంలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజులావీణ మాట్లాడుతూ దేశస్వాతంత్య్ర పోరాటంలో చిరస్థాయిగా నిలిచిన ప్రాంతాలు, స్వాతంత్య్ర సమరయోధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎం. శ్రీనివాసరావు, హిందీ లెక్చరర్ ఎస్. మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి

పార్వతీపురం టౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024లో భాగంగా బుధవారం ఎంఆర్.నగరం (కృష్ణపట్నం) జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో 8, 9వ తరగతికి చెందిన 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి 5 మంది విజేత బృందాలకు బహుమతులను లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి, అసోసియేట్ కె మౌనిక, పాఠశాల హెడ్‌మాస్టర్ విజయ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారి ఎంప నాయుడు

పార్వతీపురంటౌన్: బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని పార్వతీపురం మండలంలోని కవిటిభద్ర గ్రామంలో గల కేజీబీవీలో బాలికలకు బాలల సంరక్షణ అధికారి ఎంప నాయుడు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికలు హక్కులు, చెడు స్పర్శ, మంచి స్పర్శ, బాలికల అక్రమ రవాణా గురించి వివరించారు. మిస్సింగ్ చైల్డ్ వ్యవహారంలో టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేయాలని చెబుతూ చైల్డ్ మ్యారేజ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి. తవిటినాయుడు, ఓఆర్ డబ్ల్యూ రావాడ హరికృష్ణ పాల్గొన్నారు.

వీడీవీకే పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు

పార్వతీపురంటౌన్: మండలంలోని డోకిశిల పంచాయతీ డెప్పివలస గాంధీజీ వన్‌ధన్‌వికాస్ కేంద్రంలోని కొండ చీపుళ్ల తయారీ కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు బుధవారం సందర్శించారు. మహిళలతో మాట్లాడారు. మంచి వ్యాపార వేత్తలుగా తయారు కావాలని సూచించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీపీఎం పి.ప్రవీణ్, ఏపీఎం పి.సురేష్, చేయూత ఏపీఎం సతీష్, మండల సమాఖ్య అధ్యక్షుడు వై.జగదీశ్వరి, సీసీ నాయక్, ఎఫ్‌పీఓ సీసీ అప్పలనాయుడు, వీఓఏలు హాజరయ్యారు.

సవర భాషా ప్రచారకులకు శిక్షణ

భామిని: మండలంలోని మనుమకొండలో అక్షర బ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం ఆధ్వర్యంలో సవర భాషా ప్రచారకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు కె. కామేష్, ఎస్.వెంకటరావు, సవర బాబు, ఎస్.గంగారావు మాట్లాడుతూ, ఆదివాసీల మాతృభాషను రక్షించడంతో పాటు భాషాభివృద్ధి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సవర భాషా పుస్తకాలను పంపిణీ చేశారు.

ఘనంగా సైన్స్ డే



మక్కువ: విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ జాతీయ సలహాదారు డాక్టర్ ఎంవీవీఆర్ కృష్ణాజీ

మక్కువ:

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం ఎం. హేమలత ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం హేమలత శాస్త్రవేత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. చక్కగా ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు హెచ్ఎం హేమలత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడిపల్లి హైస్కూల్‌లో..

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జె.శ్రీధర్ ప్రదర్శించిన మైక్రోస్కోప్,అలాగే ఆల్తి పురుషోత్తం ప్రదర్శించిన రివర్ క్లీనర్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు పాఠశాల హెచ్ఎం బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు కోట అయ్యప్ప, ఎం.ప్రకాశం, డి ప్రసన్నకుమార్, పీవీఎస్‌ప్రసాద్, ఎం.వెంకటరావు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పార్వతీపురం పట్టణంలోని చర్చివీధిలో గల డీవీఎం జిల్లా పరిషత్ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎం.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మండల విద్యాశాఖాధికారి ఎస్.సింహాచలం, మరో ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రశ్నించేతత్వం అందరికీ ఉండాలన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన జేవీవీ జాతీయ సలహాదారు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందినా సరే, దాని ఫలాలు సమాజంలో అందరికీ సమానంగా అందడంలేదని, కార్పొరేట్లు కూల్‌డ్రింకులనుంచి అన్ని రంగాల్లో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్య పరచాల్సిన బాధ్యత జేవీవీ లాంటి సంస్థలకుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకే చదువు అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మన దగ్గరున్న ప్రధాన ఆయుధమని ఉద్ఘాటించారు. విశాలమైన ప్రాంగణాలు, కంప్యూటర్లు, మంచి ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ రంగంలోనే ఉన్నదని, దానిని సరిగ్గా ప్రస్తుత విద్యార్థిలోకం ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సభలో జేవీవీ రాష్ట్ర నాయకుడు పాలక రంజిత్ కుమార్, జేవీవీ జిల్లా కార్యదర్శి స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో జీవనోపాధి పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు

సీతానగరం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సహాయంతో మహిళా సంఘాల సభ్యుల వ్యాపారాభివృద్ధికి తోడ్పడి స్వయం ఉపాధి పొందడానికి సీసీలు అవగాహన కల్పించాలని ఏపీఎం రెడ్డి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, సీసీలతో ఆసరా నిధుల వ్యయంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు మండల సమాఖ్యలో 1139 మహిళా స్వయం సహాయక సంఘాలున్నాయని, ఆయాసంఘాల్లో గల 13,195 మంది సభ్యులకు రూ.6 కోట్ల 86 లక్షలు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసి బ్యాంక్ ఖాతాల్లో జమచేసిన విషయాన్ని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆసరా నిధులు బ్యాంక్ అకౌంట్ల నుంచి సభ్యులంతా విత్‌డ్రా చేయడాన్ని సీసీలు గమనించి స్వయం ఉపాధి పొందడానికి, ఇప్పటికే చేస్తున్న వ్యాపారాభివృద్ధికి ఉపయోగించేలా పొదుపు సంఘాల సభ్యులకు క్షేత్రస్థాయిలో వీఓఏల పర్యవేక్షణలో అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే గ్రామైక్య సంఘాల సభ్యుల కోరిక మేరకు పొదుపు సంఘాల సభ్యుల విరామ సమయాన్ని గుర్తించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సత్యంనాయుడు, కోటేశ్వరరావు, ఆనంద్, మోహనరావు, పలుగ్రామాల మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పరిశీలన



మాట్లాడుతున్న ఎల్ఐపీ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొ.ఎన్ ఉపేందర్

సీతానగరం: అభ్యసన అభివృద్ధి పట్ల ఉపాధ్యాయులు పలుజాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఉపేందర్ రెడ్డి, ఎస్ఆర్‌జీ ఎ.ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభ్యసన అభివృద్ధిపై 6,7,8 తరగతుల విద్యార్థుల విద్యాస్థాయిని వారు పరిశీలించారు. అనంతరం ఎల్ఐపీ అమలులో పరిశీలన చేసిన అనంతరం ఉపాధ్యాయులతో బోధన నిర్వహణ,కృత్యాలపై చర్చించారు. తరగతిలో బోధించే టీచింగ్, పీరియడ్ ప్రాజెక్టు పీరియడ్‌లో నిర్వహించే కృత్యాలు సోపానాల వారీగా టీచర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. తరగతిలో ఉన్న అందరు విద్యార్థులకు చదవడం, రాయడం ప్రధానంగా రావాలని, తదుపరి తరగతి స్థాయికి సామర్థ్యాల వారీగా మెరుగుకు కృషిచేయాలని సూచించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల దగ్గర అభ్యాసనాభివృద్ధి కార్యక్రమ సూచికలు ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ హరి, ఎంఈఓ–1 జి.సూరిదేముడు, ఎంఈఓ–2 ఎం. వెంకటరమణ, హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో జేఏఎస్2 శిబిరం పరిశీలన



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఆర్బీఎస్‌కే అధికారి ఆర్.బీఎస్‌కే భాస్కరరావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 2,3 వార్డులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్–2) కార్యక్రమాన్ని జిల్లా ఆర్బీఎస్‌కే అధికారి ఆర్.బీఎస్‌కే భాస్కరరావు, డీఐఓ నారాయణ బుధవారం తనిఖీ చేశారు. వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. రోగులు చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకుని తగు చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు తనిఖీలను పరిశీలించి కాటరాక్ట్ సర్జరీలకు గుర్తించి వారికి సరైన నిర్దేశం చేయాలని, కళ్ల జోళ్లు అవసరమైన వారి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది పరిశీలనలో ఉండాలని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగాలకు ఆరోగ్యం గురించి సూచనలు చేశారు. ఫార్మశీ వద్ద మందులను పరిశీలించి మందులు వినియోగించే విధంగా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. జేఏఎస్–2లో అందజేసిన వైద్య సేవలను ఆన్‌లైన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైద్యాధికారి లావణ్య, స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ వవన్‌కుమార్, డాక్టర్ సాగరిక, సూపర్‌వైజర్ వీరినాయుడు, జయగౌడ్, ఇందిర, వైద్య సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



సీతానగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ



జోగింపేట స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్ పరీక్ష కేంద్రం

సీతానగరం: మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీయట్ పరీక్షలు సీతానగరం మండలంలోని రెండు కేంద్రాల్లో జరుగుతాయని పరీక్షల చీఫ్ సూపరెంటెండెంట్‌లు పి.వెంకటినాయుడు, డీజీఎస్‌వీ త్రినాథ్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ మార్చి 1వ తేదీనుంచి 18వ తేదీవరకూ పరీక్షలు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయన్నారు. పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటల 45 నిమిషాలకు హాజరు కావాల్సి ఉందని స్పష్టం చేశారు. జోగింపేట గిరిజన స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యాలయం ప్రిన్సిపాల్ పోల వెంకటి నాయుడు మాట్లాడుతూ తమ కళాశాలలో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలియజేశారు. అలాగే సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ మాట్లాడుతూ ఇక్కడి పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ 282 మంది, సెకెండియర్ 294 మంది విద్యార్థులు పరీక్షలకు రాయాల్సి ఉందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు:

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె పట్టణంలోని పెదకోమటిపేట సచివాలయం పరిధిలో డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు వైద్యాన్ని ముఖ్యమంత్రి చేరువచేశారన్నారు. ఆరోగ్యసురక్ష కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. అనంతరం శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భామిని: మండలంలోని బాలేరు కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంట పుట్టి గౌడు మురళి తీవ్రంగా గాయపడ్డాడు. వంటలు చేసి ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై ఏబీ రోడ్డుపై వెళ్తుండగా పక్కగా వెళ్తున్న లారీ తగిలి ఈడ్చుకుపోయింది. దీంతో మురళి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 అంబులెన్స్‌లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బత్తిలి ఏఎస్‌ఐ కె.కాంతారావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సారా తరలిస్తే ఖబడ్దార్..!

- ఎన్నికల వేళ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఏఓబీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- 3 నెలల కాలంలో 318 కేసుల నమోదు, 342మంది అరెస్టు



పాలకొండ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో బెల్లపు ఊటలు ధ్వంసం చేసిన సిబ్బంది



సాలూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో సారాను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ సిబ్బంది



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

పార్వతీపురంటౌన్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మద్యం అక్రమ రవాణా..ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల చాటుమాటున జరిగే సారా తయారీపై జిల్లా యంత్రాంగం పటిష్ఠ మైన నిఘా పెట్టింది. ఈ మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసులు సంయుక్త బృందాలుగా ఏర్పాటయ్యారు. జిల్లాలో రవాణా అనుబంధం ఉన్న గ్రామాల వద్ద సారా, అక్రమ మద్యం రాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఎన్నికలలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా కట్టడి చేయడంతోపాటు సారాను అరికట్టేందుకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా గత డిసెంబరు 2వ తేదీ నుంచి నిఘాను మరింత పెంచారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు చెందిన అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ మద్యం సరఫరా చేసే దారులపై ఆయా బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ముఖ్యంగా పార్వతీపురం మండలంలోని ఆర్కే బట్టివలస, కొమరాడ మండలంలోని పిల్లిగుడ్డి, కూనేరు, కంచరపాడు, పాచిపెంట మండలంలోని బంగారుగుడ్డి, ఈతమానువలస, చంద్రుమానువలస ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సారా, అక్రమ మద్యం అధికంగా వస్తోందని గుర్తించిన జిల్లా యంత్రాంగం చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని పెంచింది. పాచిపెంట మండలం పి.కోనవలస, కొమరాడ మండలం కూనేరు వద్ద చెక్ పోస్టులు ఉన్నాయి. చెక్ పోస్టు మీదుగా వచ్చే ప్రతి వాహనాన్ని పక్కాగా చెక్ చేసి గానీ విడిచిపెట్టడం లేదు. రహదారులపై ఆకస్మిక తనిఖీలు పెంచారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే కాకుండా, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్లు పార్వతీపురం, సాలూరు, కురుపాం, సీతానగరం పరిధిలో కూడా బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బెల్ట్‌షాపుల ద్వారా జరుగుతున్న అమ్మకాలు, సారా నిల్వకేంద్రాలపై దాడులు చేస్తున్నాయి. కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు సారా కట్టడి కోసం నిర్వహిస్తున్న నిరంతర సమీక్షలు కూడా దాడుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నాయి.

క్రమం తప్పకుండా అవగాహన

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సారా తయారీని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు ఇప్పుడు ఫలితాన్నిస్తున్నాయి. సరిహద్దు గ్రామాల్లో సారా తయారు చేస్తున్న గ్రామాలను గుర్తించారు. ఈ గ్రామాలలో విస్తృతంగా దాడులు చేయడం, పీడీ చట్టం కింద కేసుల నమోదు, సారాకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి గిరిజనులను చైతన్యవంతులను చేస్తున్నారు. పరివర్తన 2.0లో భాగంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మరిన్ని కుటుంబాలు సారా తయారీకి దూరమవుతున్నాయి.

పూర్తిస్థాయిలో నిఘా



రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో సారాను నిర్మూలించేందుకు పూర్తి ప్రణాళికలు రూపొందించాం. ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు, అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టాం. సారా రవాణా, తయారీ, అమ్మకాలు వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ఎప్పటికప్పుడు సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం.

– జీవన్ కిశోర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం జిల్లా

పట్టుబడుతున్న అక్రమ మద్యం, సారా

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా పెరిగిన తరువాత అక్రమ మద్యం, సారా పెద్ద మొత్తంలో పట్టుబడింది. ముఖ్యంగా యానాం నుంచి వస్తున్న మద్యం అధికంగా పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 318 కేసులు నమోదు చేసి 342 మందిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు 345.65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఐడీకేస్ (సారా)కు సంబంధించి 5072 లీటర్ల సారా, 36,950 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు.

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.1.683 కోట్లు మంజూరు

గుమ్మలక్ష్మీపురం:

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా గుమ్మలక్ష్మీపురం మండలంలోని 8,364 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.1.683 కోట్లు సాయాన్ని జమ చేసిందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన బుధవారం మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే నాలుగేళ్ల పాటు రైతులకు ప్రభుత్వం సాయం అందించిందని, ఐదో ఏడాదిలో ఇప్పటికే రెండు విడతల్లో సాయాన్ని అందించిన ముఖ్యమంత్రి మూడో విడతగా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన రైతులకు రూ.1683 కోట్లను బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారని తెలిపారు.